విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 24 నవంబరు 2024 8 పేజీలు

కంప్యూటరీకరణేది?

- పీఏసీఎస్‌లలో ప్రారంభంకాని ఆన్‌లైన్ సేవలు
- తేలని లెక్కలు
- దస్త్రాల నమోదులో నత్తనడక

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఆర్థిక లావాదేవీలు, రుణాల మంజూరు, వ్యాపారాల నిర్వహణలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా అంతా పారదర్శకంగా సాగాలని పిఏసిఎస్ లలో దస్త్రాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కంప్యూటరీ కరణ చేయాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో సభ్యులు, ఖాతాల లెక్కలు తేలడంలేదు. దస్త్రాల నమోదు నత్తనడకగా సాగుతోంది.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా చేయూతనిచ్చి అన్నదాతలకు సాయం అందించాలని ముందు కొచ్చింది. నాబార్డ్ ద్వారా తోడ్పాటునందించి మరింత బలోపేతం చేయాలని సంకల్పించింది. ఇందుకు లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, దస్త్రాలు, సభ్యుల సమాచారాన్ని కంప్యూటరీ కరణ చేయాలని నిర్ణయించింది. కంప్యూటరీకరణ సేవలు కల్పించేందుకు ఒక్కో పరపతి సంఘానికి రూ.3.50 లక్షలు కేటాయించారు. కేంద్రం వాటా 70 శాతం, రాష్ట్రం వాటా 30శాతం, నాబార్డ్10 శాతం ఖర్చు చేసేలా అనుమతిం చారు. కంప్యూటరీకరణ ఆన్‌లైన్ సేవలు అందించడానికి ప్రతి సభ్యుని, ఓటరు సమాచారాన్ని నమోదు చేయడానికి ఆధార్ సంఖ్యతో అను సంధానం చేయాలని ఆదేశాలందాయి. ఇప్పటికే జిల్లాలో ▶మిగతా 2లో..

సమానపనికి సమానవేతనం

జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం పురస్కరించుకొని శనివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన ప్రదర్శన రాజరాజేశ్వరి టాకీస్, పొట్టి శ్రీరాములు విగ్రహం,గంగానమ్మ గుడి, మసీద్ సెంటర్, బస్టాండ్,సూర్య కాలేజీ,విద్యా వికాస్,రామచంద్ర,గర్ల్స్ హైస్కూల్ మీదుగా లైన్స్ క్లబ్ హాల్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది.ప్రదర్శనలో కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని,పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.31 వేలు ఇవ్వాలని,హెల్త్ కార్డులు జారీ చేయాలని,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, నినాదాలు చేస్తూ కార్మికులు కదం తొక్కారు.ప్రదర్శనలో అగ్రభాగాన ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమల్ల సుబ్బారాయుడు,సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కూన పాముల విగ్నేష్ ,ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి. బాబు, ఏలూరు నగర అప్పల రాజు, వెంకట్రావు, నిమ్మల సుబ్రహ్మణ్యం, బొక్క శ్రీనివాస్, ద్వారకాతిరుమల మండల సిపిఐ కార్యదర్శి గొలిమే బాలయేసు తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : క్షేత్రస్థాయిలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావుతో కలిసి రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, రోడ్డు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, నగర వనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులకు స్థలం గుర్తింపు, రీ సర్వే గ్రామసభల నిర్వహణ, ధాన్యం కొనుగోల ప్రక్రియ వంటి అంశాలపై జేసీ..క్షేత్రస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ పనులకు సంబంధించి ఆటంకం లేకుండా వేమగిరి, తీపర్రు దగ్గర రెండు ఇసుక రీచ్‌లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయిం చిందన్నారు.

కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు మూడు ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వహణకు అవసరమైన ఏజెన్సీలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని త్వరలో ఇసుక స్టాక్ పాయింట్లు నుంచి కూడా ఇసుక బుక్ చేసుకోవచ్చని జేసి తెలిపారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె శ్రీమణి, ఎన్ఎచ్ఏఐ పీడీ డి. బెనర్జీ, రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కాంత్రు, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం. దేవుల నాయక్, అన్ని మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల చేతివాటం

రూ.44 లక్షల అవకతవకలు

విశాలాంధ్ర-కడియం : మహిళా సంఘాలకు సంబంధించి రుణాల పంపిణీలో కడియపులంక గ్రామానికి చెందిన వివోఏలు సుమారు 44 లక్షల రూపాయల మేర అవకతవకలకు పాల్పడ్డారని గ్రామ ఇన్చార్జ్ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ తెలిపారు. విచారణ జరుగుతుండగా వివోఏలు కొంత సొమ్ములు జమ చేసినట్లు తెలిసిందని అయినా రూ.44 లక్షల అవినీతి జరగడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మహిళా సంఘాల రుణాలు వాటి చెల్లింపుల్లో అవకతవకలు జరుగుతున్నా యని పలువురు మహిళా సంఘాల సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి డిఆర్డిఏ పీడీ మూర్తిని కలిసామని, వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రతి సోమ వారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌లో కూడా ఫిర్యాదు చేసామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చొరవతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిఆర్డిఏ పిడి ఓ కమిటీ వేసి గత కొన్ని రోజులుగా మహిళా సంఘాలకు సంబంధించి ▶మిగతా 4లో..

సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించ నున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి రెవిన్యూ పోలీస్ ఇతర ఎన్నికలు విధులు నిర్వహించే ఎంసిసి, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, ఎం సి ఎం సి బృందాల చేపట్టి నిధులపై కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పి డి. నర్సింహ కిషోర్, జెసి చిన్న రాముడు, సహాయ ఎన్నికల అధికారి, డి ఆర్వో టి. సీతారామ మూర్తి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించ నున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సజావుగా నిర్వహించాలన్నారు. ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం అయిదు మంది అభ్యర్ధులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుం దని కలెక్టర్ తెలిపారు. మొత్తం 2894 మంది ఉపాధ్యాయుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకోనున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు. డిఆర్ఓ , సహాయ ఎన్నికల అధికారి టి. సీతారామమూర్తి, ఎన్నికల అధికారి ఎమ్. మాధురి, ఆర్డీవోలు ఆర్. కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డి.ఎస్.పిలు టీవీఆర్కే కుమార్, కే.రమేష్ బాబు, డీటీఓ ఎన్. సత్యనారాయణ,జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు

విశాలాంధ్ర-ఏలూరు: విధులను సక్రమంగా చేయనందుకుగాను ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ తాకీదులు జారీ చేశారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి జడ్పీ హైస్కూల్‌ను డిఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయునికి, విద్యార్థుల నోటు పుస్తకాలు దిద్దనందున స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్లను సంజాయిషీ కోరుతూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలల సందర్శన సమయంలో విధులను సక్రమంగా నిర్వహించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సీఎంకు వినతి

విశాలాంధ్ర -లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్ర బాబును కలిసి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రతిపాదనలు అందించారు. నియోజకవర్గంలో ఉన్న సమస్య లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. కాలువలపై వంతెనల నిర్మాణం, జంగారెడ్డి గూడెం మున్సిపాలిటీ అభివృద్ధికి చేయాల్సిన పనులను, నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు,విద్య,వైద్య రంగాలలో కల్పించాల్సిన వసతులను ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రధానంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయటానికి తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎమ్మెల్యే ఇచ్చిన వినుతులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కార్యాలయపు వర్గాల ద్వారా తెలిసింది.

లారీ బోల్తా

విశాలాంధ్ర-లింగపాలెం: జూబ్లీ నగర సమీపంలోని మలుపు వద్ద టైల్స్ తీసుకు వెళుతున్న లారీ బోల్తా పడింది. టిప్పర్ నుంచి టైల్స్ వేసుకొని ఖమ్మం వెళుతున్న లారీ లింగపాలెం లోని జూబ్లీ నగర్ మలుపులో ప్రమాదవ శాత్తు బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో డ్రైవర్ వీరబాబుకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.లారీలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు.

అనారోగ్యంతో ఎయిమ్ రాష్ట్ర నాయకుడు విల్సన్ మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: అంబేద్కర్ ఇండియన్ మిషన్ రాష్ట్ర నాయకుడు దూబా విల్సన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండల కేంద్రమైన టి నరసాపురం గ్రామానికి చెందిన విల్సన్ దళిత ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ అంబేద్కర్ ఇండియన్ మిషన్ (ఎయిమ్) రాష్ట్ర నాయకుడిగా పనిచేశారు. అంబేద్కర్ ఆశయసాధన, దళిత పంచాయతీ సాధనే లక్ష్యంగా పనిచేసిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతికి రాష్ట్ర, జిల్లా, మండలంలోని దళిత, ఎయిమ్ నాయకులు నివాళులు అర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: అంతర్జాతీయ స్థాయి గుర్తింపునకు క్రీడలు చాలా అవసరమని, గెలుపు, ఓటములు క్రీడాకారులు సమానంగా స్వీకరించి ముందుకు అడుగులు వేయాలని, నేటి ఓటమి రేపటి విజయానికి నాంది అని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం డియన్ఆర్ కళాశాల క్రీడామైదానంలో 16వ ఈషా గ్రామోత్సవం రూరల్ ప్రీమియం లీగ్ - 24ను జాయింటు కలెక్టరు లాంఛనంగా ప్రారంభించారు. వివిధ టీమ్‌లలో క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఏ ప్రాంతం నుండి వచ్చారని, యోగక్షేమాలను అడిగి తెలుసుకుని విజయం సాధించాలని ఆయన ఆశీస్సులను అందజేశారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు.

విద్యతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని యువత గుర్తించా లన్నారు. గెలుపు ఓటములు సహజమని, నేడు ఓటమి రేపటి విజయానికి నాంది అన్నారు. రిజర్వేషను ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రతి క్రీడాకారులు పొంది పుట్టి పెరిగిన గ్రామానికి, రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తెచ్చి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జాయింటు కలెక్టరు అన్నారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు బాబు, ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ డి.విజయ, ఉపేంద్ర వర్మ, కేపి వర్మ తదితరులు మాట్లా డారు. కార్యక్రమంలో తహశీల్దారు రావి రాంబాబు, కళాశాల పాలకవర్గ సభ్యులు కునపరాజు రామకృష్ణంరాజు, బి.వి.నరసింహ రాజు, పిఇటి ఉపాధ్యాయులు, 45 టీమ్స్, పట్టణ ప్రముఖులు, ప్రజలు,విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటిని అందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: రక్షిత మంచినీటిని రెండు పూటలు పుష్కలంగా అందించాలని, జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను నాణ్యతా ప్రమాణాలతో ప్రజలు సంతృప్తిని పొందే స్థాయిలో ఉండాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో గ్రామ నీరు సరఫరా, పారిశుద్ధ్యం, జల జీవన్ మిషన్, అంగన్వాడి సెంటర్లు టాయిలెట్స్, అంగన్వాడి సెంటర్లలో మంచినీటి సదుపాయం, ఓ.హెచ్.ఎస్.ఆర్ నిర్మాణాలు, రిపేర్లు, ఫిల్టర్ల రీప్లేస్మెంటు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సమావేశం నిర్వహిం చారు. జరుగుతున్న పనులపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ఓ.హెచ్.ఎస్.ఆర్ లు 998 పనులకు గాను 554 పూర్తికావడంపట్ల జిల్లా కలెక్టరు సంతృప్తిని వ్యక్తం చేస్తూ వివిధ దశల్లో ఉన్న మిగిలిన వాటిని మార్చి 31,2025 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడి సెంటర్లో 150 మరుగుదొడ్లకు గాను 20 మాత్రమే పూర్తి చేయడం పట్ల అసహనం వ్యక్తం

చేస్తూ, మిగతావి డిసెంబరు 31వ తేదీ నాటికి నూటికి నూరు శాతం పూర్తి అవ్వాల్సిందేనని కలెక్టరు ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా రూరల్ డెవలప్మెంట్ వాటర్ వర్క్స్ అధికారి బి.వి.వి.నాగేశ్వర రావు,జిల్లా ఐసిడిఎస్ నోడల్ అధికారి పి.విజయ లక్ష్మి,ఇవో సి.హెచ్.సుజాత లక్ష్మి, డిఇలు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణేది?

(1వ పేజీ తరువాయి)

సగం సంఘాలలో కూడా కంప్యూటరీ కరణ ప్రక్రియ పూర్తికాలేదు. వచ్చేనెలాఖరులోపు పూర్తవ్వాలని గడువు విధించారు. నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయడానికి సహకార సంఘాల యంత్రాంగం కుస్తీ పడుతోంది. గతంలో నమోదైన చాలామంది సభ్యులు ఉపాధి, ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో అందుబాటులో లేరు. మరికొందరు మృతి చెందారు. మరోవైపు.కొంతమంది రుణాలు పొంది తిరిగి చెల్లించడం లేదు. మొండి బకాయిదారుల జాబితాలో చేరారు. సిబ్బంది చేతివాటంతో అక్రమాలు జరిగాయి. నిబంధనలను తుంగలోకి తొక్కి అవకతవకలకు పాల్పడ్డారు.ఇలాంటి చోట దస్త్రాల నమోదుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ ప్రక్రియ నిదానంగా

జిల్లాలో సొసైటీలలో నమోదైన సభ్యుల వివరాలను ఆధార్ తో అనుసంధానం చేశారు. జిల్లాలో అనేక చోట్ల నమోదు ప్రక్రియ నిదానంగా సాగుతోంది.

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో దస్త్రాలు, సభ్యుల సమాచారం, ఖాతాల ఆర్థిక లావాదేవీల కంప్యూటరీకరణ,ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు అందాయని జిల్లా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో వెనుకబడిన పిఏసిఎస్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, నిర్దేశిత గడువులోగా ఆన్ లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కేంద్ర మంత్రిని పరామర్శించిన పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర -భీమవరం: పితృ వియోగంతో బాధపడుతున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను, వారి కుటుంబ సభ్యు లను పలువురు ప్రముఖులు పరామర్శించి ఆయన తండ్రి సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో వారు కేంద్ర మంత్రిని వారి తండ్రి గురించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విధాన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంపీలు కనుమూరి బాపిరాజు, తోట సీతారామలక్ష్మి, జిల్లాలోని ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజ నేయులు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన రావు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తదితరులు నివాళులు అర్పించారు.

కౌన్సిలర్ పోస్టులకు దరఖాస్తులు

విశాలాంధ్ర -భీమవరం: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం క్రింద పనిచేస్తున్న హెల్ప్ లైన్ సెంటరులో రెండు కౌన్సిలర్ పోస్టుల్లో పనిచేయడానికి జిల్లాలో దళిత సమస్యల పై అవగాహన ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర హక్కుల రక్షణ చట్టం, అత్యాచారాల నిరోధక చట్టం ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరిగేటందుకు గాను కేంద్ర సాంఘిక, సామాజిక న్యాయం మంత్రిత్వ శాఖ సూచనపై దరఖాస్తులను కోరుతున్నామని తెలిపారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తమ పేరు, చిరునామా, పనిచేసిన శాఖ, హోదా, పదవి విరమణచేసిన తేది తదితర వివరములతో కూడిన ధరఖాస్తును కలెక్టరేట్‌లోని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖకు ఈ నెల 30వ తేదీలోపు అందచేయాలని ఆమె సూచించారు.

ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర-కామవరపుకోట: ఆడమిల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మోటపర్తి సాయి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన విదితమే. చింతల పూడి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు జుజ్జూరు బాబ్జి శనివారం బాధితుడ్ని పరామర్శించి రు. 11 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కుటుంబ సభ్యులకు మంత్రి నిమ్మల పరామర్శ

విశాలాంధ్ర - పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం పార్లమెంట్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు ఇటీవలే మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ముందుగా సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: గత మూడు దశాబ్దాలుగా రైతులు సాగులో ఉన్న అటవీ బంజరు భూమిలో సాగవుతున్న మామిడి మొక్కలను నిర్లక్ష్యంగా నరికి వేసిన ఎన్టీఆర్ జిల్లా మైలవరం అటవీ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూజివీడు మండలం మిట్ట గూడెం గ్రామానికి చెందిన రైతులు 1998 ప్రాంతంలో నూజివీడు మండలం మిట్ట గూడెం సరిహద్దున ఉన్న అన్నేరావుపేట అటవీ భూమిలో భూ పోరాటాల ద్వారా సాధించుకున్న భూముల్లో మామిడి మొక్కలు వేసి వాటిని సాగు చేస్తూ వాటి ద్వారా వచ్చే ఫల సాయంతో కుటుంబాలను పోషించుకుంటున్న మిట్ట గూడెం గ్రామానికి చెందిన రైతులు వి. నాగరాజు, మట్ట పుల్లయ్య తదితరులు సాగులో ఉన్న భూమిలో ముదురు మామిడి చెట్లను నరికి వేసిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విప్ పదవితో మరింత బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకు అసెంబ్లీలో విప్ పదవి ప్రకటించి బాధ్యత మరింత పెంచారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం నియోజక వర్గం ప్రజలు అఖండ మెజారిటీతో తనను శాసనసభ్యునిగా అసెంబ్లీకి పంపితే , తాను సరైన అభ్యర్థిని అని నమ్మి జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాండేట్ ఇవ్వడం, దానికి టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియ జేశారు. కూటమిలో భాగస్వామి అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి,కూటమి నాయకు లందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రముఖ స్థానం కల్పించారని జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉంటే ఐదు మంది ఎమ్మెల్యేలకు పదవులు ఇవ్వడం సాధారణ విషయం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత జిల్లాపై ఉన్న అభివృద్ధి కూడా అదే స్థాయిలో జరిగేలా చూసుకుంటామన్నారు.



జగన్ ముడుపులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: అదానీ నుండి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూ. 1750 కోట్ల ముడుపులు పొందినట్లు అమెరికా ధ్రువీకరించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గోళ్ళ పవన్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ అవినీతిపై నేడు అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందన్నారు. అదానీ దేశం పరువు తీస్తే, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర పరువు తీయడంతో పాటు ప్రజలను పూర్తిగా తాకట్టు పెట్టారని విమర్శించారు . అదానీ గ్రూపు లంచాల వ్యవహారంలో మాజీ సీఎం జగన్ ముడుపులు తీసుకున్నారన్న అంశం అంతర్జాతీయ స్థాయిలో స్పష్టమైందన్నారు. గంగవరం పోర్టులో కీ.శే. డాక్టర్ వైయస్ రాజశేఖర్రెడ్డి హయాంలో ప్రభుత్వానికి పది శాతం వాటా ఉండేదని, దానిని కూడా జగన్ అదానీ గ్రూపుకు కట్టబెట్టినట్లు వివరించారు. సుమారు 9వేల కోట్ల రూపాయల విలువైన వాటాను అదానీకి కేవలం రూ.640 కోట్లకు అందించటం దారుణం అన్నారు. మొత్తం ఈ అవినీతి బాగోతాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియచేయవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉన్నదన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్, డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీ యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయుటలో, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడంలో, అధిక ఫీజులు వసూలు చేసినా అలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్ట రీత్యా అటువంటి కాలేజీ యాజమాన్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు.అటువంటి కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామ న్నారు. జ్ఞానభూమి పోర్టల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ఫీజు రియింబర్స్ మెంట్(ఆర్ టిఎఫ్), మెస్ చార్జీలు (ఎంటిఎఫ్) మంజూరు చేస్తా రన్నారు. ఏలూరు జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు,ప్రిన్సిపాల్స్, విద్యార్థులను వేధింపులకు గురిచేయ కుండా, వారికి అవసరమైన హాల్ టికెట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వవలసినదిగా తెలిపారు. ఒరిజినల్ ధ్రువ పత్రాలు ఇవ్వకపోయినా, విద్యార్థులు కలెక్టరు వారి గ్రీవెన్స్ సెల్ నెంబరు: 9491041188 కు ఫోన్ చేసి మీ ఫిర్యాదును తెలియపర్చవచ్చున్నారు.

కోర్టు భవనాలు పూర్తి చేయండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం కోర్టు కాంప్లెక్స్, న్యాయమూర్తుల క్వార్టర్స్ నిర్మాణం, మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మూడవ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి యం.ఏ.సోమ శేఖరు సంయుక్తంగా జిల్లా కోర్టు భవన నిర్మాణం, న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్ మరమ్మత్తులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరంలో రూ.85.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న కోర్టు కాంప్లెక్స్, భీమవరం, తణుకు పట్టణాల్లోని న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్ మరమత్తులు, తణుకు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి నివాస క్వార్టర్స్, తదితర పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాల న్నారు. పనుల పురోగతిపై వారం వారం నివేదిక తయారు చేసి అందజేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. మూడవ అడిషనల్ జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి యం.ఏ.సోమ శేఖరు మాట్లాడుతూ చిట్ ఫండ్స్, తదితర ఫైనాన్స్ సంస్థలకు సంబంధించి జిల్లాలో 83 కేసులు పెండింగ్ లో ఉన్నాయని, ఈ కేసులు త్వరితగతిన పరిష్కారానికి డిసెంబర్ 14న నిర్వహించనున్న లోక్ అదాలత్ లో ఉంచేందుకు కృషి చేయాలని చిట్ ఫండ్స్ రిజిస్ట్రార్కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, జిల్లా రోడ్లు,భవనాలు శాఖ ఇఇ ఏ.శ్రీనివాసు, డిఇ లు పి.వి. రామరాజు, బి.వి.రమణ, జి.వి.కిరణ్ కుమార్, జి.వరలక్ష్మి, విద్యుత్తు శాఖ సహాయ సంచాలకులు కె. బాల వెంకటలక్ష్మి,ఆర్ అండ్ బి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం

విశాలాంధ్ర-ఏలూరు : ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్నారని ఎంపీ తెలిపారు. అధికారులు, తాను ఎప్పుడు పర్యటనకు వెళ్లినా పోలవరం నిర్వాసితుల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయని ఎంపీ స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి సహకరించాలని ఇటీవల తాను కేంద్ర మంత్రులను కలిసి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారని, భవిష్యత్తులో ఆ పరిశ్రమలు కూడా ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీ స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, రైల్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు. జల్ శక్తి మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

విశాలాంధ్ర- ఏలూరు: జిల్లాలో 59 ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాలు ఉండగా వాటిలో6వేల 120 మంది విద్యార్థులు వసతి పొందు తున్నారని జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి. విజయ్ ప్రకాష్ తెలిపారు. కొన్ని వసతి గృహాలలో రూ. 50 లక్షలు ఎంపీ ల్యాడ్స్ తో మరమ్మత్తులు నిర్వహించామన్నారు.వసతి గృహాలలో ఉన్న విద్యార్థులకు దుప్పట్లు, బెడ్ షీట్స్,ట్రంక్ పెట్టెలు,కాస్మోటిక్స్ అందించామన్నారు. గతంలో విద్యార్థులకు వసతి గృహాల లో రెండు జతల యూనిఫామ్స్ అందించే వారమని,ప్రస్తుతం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యా కానుకలో భాగంగా రెండు జతల దుస్తులు,పాఠ్య పుస్తకాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు.

డ్వాక్రా సమైక్య అధ్యక్షురాలిగా జయలక్ష్మి శ్రీనివాస్

విశాలాంధ్ర-ఉండి : ఉండి మండలం డ్వాక్రా సమాఖ్య అధ్యక్షురాలుగా మండల కేంద్రమైన ఉండికి చెందిన కర్రి జయలక్ష్మి శ్రీనివాసు శనివారం నియమి తులయ్యారు. కర్రి జయలక్ష్మిని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కర్రి జయలక్ష్మి శ్రీనివాసులు పై నమ్మకం ఉంచి ఎంపిక చేసిన రఘురామకృష్ణ రాజు కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రఘురామ కృష్ణరాజుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్వాక్రా సంఘాల గ్రూపులను విజయవంతంగా ముందుకు నడిపిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలకు సకాలంలో రుణాలు మంజూరు అయ్యేలా నిరంతరం పాటు పడతామన్నారు. మహిళ ఆర్థిక స్వా వలంబన పొందే విధంగా కృషి చేస్తామన్నారు. డ్వాక్రా సంఘాలు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయ సహకారాలు పొంది అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నట్లు కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జెష్ట రామకృష్ణారావు తెలిపారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో ప్రమాద బీమా వర్తిస్తుందని, టిడిపి సభ్యత్వ ప్రమాద బీమా పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవడానికి ముందుకు రావాలని రామకృష్ణారావు తెలిపారు. మండలంలో ఈయనతోపాటు కన్నాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గొడవర్తి. ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మండల యూత్ నాయకులు గంట సుబ్రహ్మణ్యం కలసి ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ ఆధ్వర్యంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు రామకృష్ణారావు పేర్కొన్నారు.

వృద్ధురాలి మృతి పై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: 80 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అల్లంచర్ల కొత్తగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు సూరబోయిన మాణిక్యం (80) షుగర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నది. ఈ నెల 22న కళ్ళు తిరిగి క్రింద పడిపోవడంతో కుటుంబీకులు స్థానిక ఆర్ ఎం పి వద్ద వైద్యం చేయించగా కోలుకుంది. అనంతరం వృద్ధురాలికి వాంతులు అవుతుండడంతో ఏమైందని కుటుంబీకులు అడగగా గుర్తు తెలియని మందు తాగానని చెప్పడంతో వెంటనే జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదుకు స్పందన

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన

తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పిలుపుతో ఏలూరు పార్లమెంట్ పరిధిలోని నాయకులు శాశ్వత సభ్యత్వం తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. తొలి రోజు ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున 20 మంది నాయకులు చెల్లించి ఎంపీ సమక్షంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకునేందుకు మరికొందరు నాయకులు సిద్ధంగా ఉన్నారని ఎంపీ తెలిపారు. తన పిలుపుకు స్పందించి తెలుగుదేశంపార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వచ్చిన నాయకులను ఎంపీ అభినందించారు. శాశ్వత సభ్యత్వ నమోదుకు సహకరించిన నాయకులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణ, శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా అత్యధిక సభ్యత్వాలు చేసి ఏలూరు పార్లమెంటును ఆదర్శంగా నిలపాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తాం : ఎస్పీ శివకిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు సిసిఎస్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తూ

అనారోగ్యంతో చనిపోయిన ఎస్ఐ డి.నరసింహారావు కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన రాయితీలను త్వరితగతిన అందించడంతో పాటు మృతుని కుమారుడైన దిగమర్తి సుందర్ కు 60 రోజులలో ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేస్తూ ఎస్పీ శివ కిషోర్ శనివారం ఉత్తర్వులను నరసింహారావు కుటుంబ సభ్యులకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ

దివంగత ఎస్ఐ నరసింహారావు సుమారు 38 సంవత్సరాలు పాటు పోలీసు శాఖకు ఎనలేని సేవలను అందించారని ఆయన స్ఫూర్తితో పోలీసు శాఖలో కష్టపడి ఉద్యోగ నిర్వహణ చేసి పేరు నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ ఎన్. సూర్యచంద్రరావు, పోలీస్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 182.06 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యం వివరాలు సిఎంఆర్ బియ్యం వివరాలను సంబంధిత రిజిస్టర్ లో నమోదు చేసి ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో తప్పనిసరిగా చూపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి మిల్లర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం ఖరీఫ్ 2024-25 పంట కాలమునకు ధాన్యం సేకరణ తరువాత సిఎంఆర్ బియ్యం పంపిణి తీసుకోవలసిన ముందస్తు చర్యలపై రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఎఫ్ ఆర్ కె అకౌంటు వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేసి వుంచాలన్నారు. రైస్ మిల్లర్లందరు వారికి వచ్చిన ధాన్యం వివరములను మరియు సిఎంఆర్ బియ్యం వివరములను రిజిష్టరులలో నమోదు చేయించి సీజన్ ముగిసిన తరువాత పౌర సరఫరాల సంస్థ ఏలూరు కార్యాలయంలో రికన్సిలేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లాలో ఇంతవరకు రూ. 182.06 కోట్ల విలువైన 79,900 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10,628 మంది రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత, కస్టమ్ మిల్లింగ్ ద్వారా కొనుగోలు చేయబడిన ధాన్యమును బియ్యంగా మార్పు చేసి కస్టమ్ మిల్లింగ్ తర్వాత సిఎంఆర్ బియ్యం నిల్వ కోసం బఫర్ గోడౌన్‌కు డెలివరీ చేయాలన్నారు. ఈ విషయములో కస్టమ్ మిల్లింగ్ కోసం జిల్లాలో 99 సార్టెక్స్ రైస్ మిల్లులు ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రముల వద్ద ధాన్యము కొనుగోలునకు అవసరమైన గోనె సంచులు ముందుగానే రైతు సేవా కేంద్రం వద్ద ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453) ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి. శ్రీలక్ష్మి,జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి ఆర్.ఎస్.ఎస్. రాజు,విజిలెన్స్ సివిల్ సప్లైయి అధికారి దేవకిదేవి, జిల్లాలోని రైస్ మిల్లర్స్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి దాతృత్వ సేవలు స్ఫూర్తిదాయకం

మంత్రి రామానాయుడు

విశాలాంధ్ర - పాలకొల్లు :స్వాతంత్ర్య సమరయోధులు, విద్యాదాత, నిస్వార్థ ప్రజా సేవకులు, పాలకొల్లు, అద్దేపల్లి సత్యనారాయణమూర్తి దాతృత్వ సేవలు స్ఫూర్తిదాయకమని, పాలకొల్లు చరిత్రలో స్ఫూర్తిదాయకంగా అద్దేపల్లి నిలిచిపోతారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పూలపల్లి గౌతమి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు, ప్రతినెల క్రమం తప్పకుండా, నిర్వహించే అద్దేపల్లి జయంతి ఉత్సవ వేడుకల సభలో ఆయన మాట్లాడారు. ముందుగా అద్దేపల్లి చిత్రపటా నికి ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కేక్ కట్ చేసి అందరికి పంచారు. సేవా కార్యక్రమంలో భాగంగా 100వ రక్తదాన శిబిరాన్ని, జనసేన నాయకులు బోణం చిన్నబాబు ప్రారంభిం చారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు, విద్యార్థులు రక్త దానం చేశారు. మంత్రి రామానాయుడు రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అల్లూరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు, నేడు అద్దేపల్లి 125 వ జయంతి వేడుకలు సంవత్సరం పాటు ప్రతి నెల విధిగా నిర్వహిస్తున్నామని అన్నారు. అద్దేపల్లి దాతృత్వం గురించి

మాట్లాడుతూ విద్యా వ్యాప్తికి సొంత ఆస్తిని ధార పోసిన మహోన్నత వ్యక్తి అంటూ కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్గానికి చెందిన ప్రముఖులతో పాటు కళాశాల కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ శివకుమార్ లను మంత్రి రామానాయుడు ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్ర మంలో అలరించిన బాలికలను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, బోనం చినబాబు, కర్నేన రోజారమణి, ఉన్నమట్ల కపర్ధి, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, నిట్టల శైలజ, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేతివాటం

(1వ పేజీ తరువాయి)

రుణాల వివరాలు, వాటి చెల్లింపులు, శ్రీనిధి సొమ్ములు వంటి విషయాలు అధికారులు విచారణ చేపట్టారని తెలిపారు. తమ గ్రామానికి చెందిన వివోఏ ఏచూరి లక్ష్మీప్రసన్న రూ.20 లక్షలు, మరో వివోఏ పోలిశెట్టి నాగవేణి రూ.24 లక్షలు మేర అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వివోఏ అవకతవకల విషయంలో ఈ నెల 25 న జిల్లా కలెక్టర్ , డిఆర్డిఏ పిడి మూర్తి లను కలుస్తామని తెలిపారు. వి ఓ ఏ లపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసిందని రాంజీ తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు : సిఐ ధనరాజ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ శాఖ సిఐ జివిఎస్. కృష్ణ ధనరాజ్

సూచించారు. ఎక్సైజ్ శాఖ డీసీ, ఏసి, ఏలూరు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఆదేశాల మేరకు శనివారం ఏలూరులోని ఎస్పిడిపిటి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ధనరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో యువత చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. కొంతమంది యువకులు చెడుమార్గాల్లో పయనిస్తూ మత్తు పదార్థాలు వినియోగించి తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు కలిగి ఉండడం లేదా వినియోగించడం చట్టరీత్యా నేరమని గుర్తు చేశారు. అనంతరం ఏలూరు రూరల్ మండలం తాసిల్దార్ సమక్షంలో ఇద్దరు డిపిఎల్ ముద్దాయిలను బైండోవర్ చేసుకున్నారు. ఈ అవగాహన సదస్సులు కాలేజీ ప్రిన్సిపాల్ మూర్తి, గవర్నమెంట్ హాస్పిటల్ మెడికల్ కౌన్సిలర్, ఎక్సైజ్ ఎస్సైలు సుదీర్, గౌరిశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం లేస్‌కు భౌగోళిక సూచిక ఎంపికతో అంతర్జాతీయ గుర్తింపు

రేపు భౌగోళిక సూచి సర్టిఫికెట్ అందుకోనున్న కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం :భౌగోళిక సూచిక (జిఐ) ఎంపికతో నరసాపురం లేస్‌కు అంతర్జాతీయ గుర్తింపు

సాధించినట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రత్యేక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెట్ లింకేజి, బ్రాండింగ్ ప్రమోషన్ లక్ష్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 25న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. భారతీయ జౌళి పరిశ్రమలో చేతితో నేసిన, చేతితో తయారు చేసిన వస్త్రాలు దేశంలో భౌగోళిక సూచిక నమోదిత ఉత్పత్తుల పట్టికలో అగ్రగామిగా ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఎంపిక చేసిన 8 జౌళి చేతి ఉత్పత్తుల్లో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లేసు కూడా జిఐ గుర్తింపు లభించిందని, జిఐ ట్యాగ్ చేయబడిన ఉత్పత్తులతో వేలాది మంది నేత కార్మికులు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వగలుగుతామని నాగరాణి వివరించారు. ఈ వర్క్‌షాప్‌తో పాటు దేశంలో 70 కంటే ఎక్కువ జిఐ ట్యాగ్ చేయబడిన ఉత్పత్తులు ప్రదర్శించబడతాయని, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. జి.ఐ, పోస్ట్ జిఐ ఇనిషియేటివ్‌లపై చర్చించడం, ఈ ప్రత్యేకమైన ఉత్పత్తుల అభివృద్ధికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయడం సదస్సు ప్రధాన లక్ష్యం అన్నారు. అంతర్జాతీయ గుర్తింపుతో పాటు, రాష్ట్రంలో జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తుల్లో ఒకటిగా నిలవడానికి కారణమైన తయారీదారులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మణిపాల్‌సిగ్నా 'సర్వ' విడుదల

విశాలాంధ్ర-భీమవరం: అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, స్వతంత్ర ఆరోగ్య బీమా కంపెనీలో ఒకటైన మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ తన కొత్త ఆరోగ్య బీమా పథకం 'మణిపాల్‌సిగ్నా సర్వ'ను విధుల చేసినట్లు ప్రకటించింది. పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని అందించేలా ఇది రూపొందించింది, విస్తృత కస్టమర్ విభాగాలకు సరసమైన, సమగ్రమైన ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. భారత్‌లో భీమా పాలసీ తీసుకొని లేదంటే సరి అయిన కవరేజ్ లేని వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించింది. మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రసూన్ సిక్దర్ మాట్లాడుతూ, 'మణిపాల్‌సిగ్నా వద్ద , మా నిబద్ధత కేవలం ఆరోగ్య బీమాను అందించడం కంటే ఎక్కువగా ఉంది. 'మణిపాల్ సిగ్నా సర్వ' విడుదలతో, మేము పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని పరిచయం చేస్తున్నాము, ఇది విభిన్న కస్టమర్ విభాగాలను మాత్రమే కాకుండా, ప్రభుత్వం, రెగ్యులేటర్ 'ఇన్సూరెన్స్' లక్ష్యం చేరుకోవటంలో తోడ్పడుతున్నాము' అని అన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు

విశాలాంధ్ర – సామర్లకోట : సామర్లకోట బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణించే ప్రయాణికులు దొంగతనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ విక్రమ్ పాటిల్, పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు సూచనలు మేరకు, సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో సామర్లకోట బస్టాండ్ వద్ద పోలీస్ వారు విజ్ఞప్తి అని చెప్పి దొంగతనాలు పట్ల ప్రయాణి కులను అప్రమత్తం చేసేందుకు మైక్ను ఏర్పాటు చేశామని బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతం నిత్యం ప్రయా ణికులతో రద్దీగా ఉంటుందని, ఇదే ఆదునుగా చేసుకుని పలువురు దొంగలు బ్యాగ్లు జిప్పులు ఓపెన్ చేసి నగదు, బం గారు ఆభరణాలు చోరీ చేస్తున్నారని, జేబులో ఉన్న సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతు న్నారని, ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకుని అప్ర మత్తంగా ఉండాలని ఉద్దేశంతో హెచ్చరికలు తెలి యజేస్తూ మైక్ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు రోడ్డు ప్రమాదాలు నివారణలో భాగంగా బైక్ పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడప రాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని పలు సూచనలు చేస్తూ హెచ్చరిక బోర్డులు సైతం బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పా టు చేసినట్లు పేర్కొన్నారు. సామర్లకోట బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో దొంగతనాలను అరికట్టేందుకు సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి రింగ్ సెంటర్ వరకు సుమారు 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు తెలియజేశారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర- దేవరపల్లి :18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని బూత్ లెవెల్ అధికారి దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి ఎన్ రవికిషోర్ పేర్కొన్నారు దేవరపల్లిలో శనివారం 62 63 పోలింగ్ కేంద్రాలలో ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరములు నిండిన యువతీ యువకులు ఓటరు గా పేరు నమోదు చేసుకోవాలని అన్నారు శనివారం ఆదివారం రెండు రోజులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని రవి వెల్లడించారు ఈ కార్యక్రమంలో బి ఎల్ వో కే వీర కుమారి పాల్గొన్నారు

గంజాయిని తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వైపు నుండి నల్లజర్ల వైపు ఎన్హెచ్ 16 దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద రెండు మోటార్ సైకిల్ పై నలుగురు వ్యక్తులు 40 కిలోల 550 గ్రాములు గంజాయి తరలిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు దేవరపల్లి సిఐ నాగేశ్వరరావునాయక్ శనివారం తెలిపారు. దేవరపల్లి ఎస్సై సుబ్రహ్మణ్యంకు పక్కా సమాచారం అందడంతో శనివారం ఉదయం దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. విశాఖ జిల్లా పాడేరు చత్తీస్గఢ్ ఒరిస్సా సరిహద్దుల నుండి నలుగురు వ్యక్తులు కేరళ రాష్ట్రం చెందినవారు అమల్ కృష్ణ మహమ్మద్ సాహుల్ సాహుల్ మేన్ పుణీతలకు తల్ నలుగురు మోటార్ సైకిల్ పై తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్కు తరలిస్తుండగా వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిల్ 40 కిలోలు 550 గ్రాములు గంజాయిని డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ వీఆర్వో లక్ష్మీ సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు . నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుచుతున్నామని సీఐ నాగేశ్వరరావు నాయక్ తెలిపారు. ఈ కేసులో పక్కాగా గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్న దేవరపల్లి ఎస్సై వి సుబ్రహ్మణ్యం సీఐ నాగేశ్వర నాయక్ అభినందించారు. ఈ కేసులో సిహెచ్ భీమరాజు వి చంద్రశేఖర్ హెచ్సీలు ఎస్ కే సలీం బాలచందర్రావు, రామ్గోపాల, రామారావు కానిస్టేబుళ్లు ఎస్సై కి సహకరించారని సీఐ నాగేశ్వరావునాయక్ తెలిపారు.

అమ్మకానికి డ్వాక్రా ఉత్పత్తులు

విశాలాంధ్ర – నిడదవోలు : మహిళా స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులు నాణ్యతగా ఉండటంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉంటాయని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఏ.జ్యోతి అన్నారు. నిడదవోలు మెప్మా ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకాలను స్థానిక సంత మార్కెట్ లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంకులు అందజేస్తున్న రుణాలతో ఉత్పత్తులను తయారు చేసి అమ్మడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఏ. జ్యోతి,కమ్యూనిటీ ఆర్గనైజర్ లు వెంకటలక్ష్మి, సింధుమాధవి , ఆర్పీ లు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి జహన్విశ్రీకి ఆర్థిక సాయం

విశాలాంధ్ర – కరప : కాలిన గాయాలతో చికిత్స పొందుతూ 18 రోజులుగా బాధపడుతున్న తొమ్మిది సంవత్సరాల జహన్విశ్రీకి యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ మాస్టర్ ఆర్థిక సాయం అందించారు. బాలిక తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నాగుల చవితి రోజున పాప గౌను అంటుకుని 70% పూర్తిగా కాలిపోవడంతో కాకినాడ క్యాపిటల్ హాస్పటల్లో చికిత్సను అందిస్తున్నారు. ఇప్పటికే మూడు లక్షల 50 వేల రూపాయలు ఖర్చుకాగా నిరుపేద కుటుంబం కావడంతో పాపని ఆదుకోవాలని పలువురు కోరడంతో యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చి పాప వైద్య ఖర్చులు నిమిత్తం 70 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమం నరాల కృష్ణకుమార్, కామేశ్వరరావు, సందీప్, నితిన్, సుభాష్, సృజన, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేత

విశాలాంధ్ర – అనపర్తి : పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. శనివారం కుతుకులూరు ప్రశాంత్ స్కూల్లో బాబా చిత్రపటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి నివాళులర్పించి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తాతా రెడ్డి, సర్పంచ్ హేమతులసి, టిడిపి నేత కర్రి చిన్నారెడ్డి,రావాడ నాగు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి, అదానీలను తక్షణమే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర – కడియం : విద్యుత్తు రంగంలో అక్రమాలకు పాల్పడినట్టు అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ విచారణలో నిర్ధారణ జరిగిన నేపథ్యంలో పారిశ్రామిక వేత్త అదానీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిలను తక్షణం అరెస్టు చేయాలని కాంగ్రెస్ రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండరాజు డిమాండ్ చేసారు. కడియం మండలం బుర్రిలంక గ్రామంలో ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అవినీతి అమెరికా వరకు వ్యాపించిందని, అదానీ సంస్థలకు రాష్ట్రంలో విద్యుత్, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ కాంట్రాక్టులతో పాటు కృష్ణపట్నం, గంగవరం, స్మార్ట్ మీటర్లు, జెన్ కో, విశాఖలో డేటా సెంటర్ వంటి కీలకమైన వేల కోట్ల ప్రాజెక్టులు అప్పగించారని ఆరోపించారు. అటువంటి ఆర్థిక నేరస్తులపై చర్యలు తీసుకోకపోతే ప్రధాని నరేంద్ర మోదీ కూడా వారికి మద్దతిస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుందన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో జగన్ కు 1750 కోట్లు ఇచ్చినట్టుగా ఎఫ్ బి ఐ తేల్చిందని, ఆయనపై ఇప్పటికే 32 ఇడి, సిబిఐ కేసులు పెండిగ్లో ఉన్నాయని, ఆ కేసుల్లో బెయిల్ పై ఉన్నారన్నారు. బెయిల్ తక్షణం రద్దు చేసి, జగన్ను అరెస్టు చేయడంతో పాటు ఎఫ్ బి ఐ నిర్ధారించిన కేసులో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. తన సోషల్ మీడియా కార్యకర్తలతో సొంత చెల్లెలి గురించి అబ ద్దాలు ప్రచారం చేసి పరువు తీసిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఈసమా వేశంలో మాజీ మండల ప్రెసిడెంట్ కొత్తపల్లి సత్యనారాయణ మూర్తి, మండల ప్రెసిడెంట్ సత్యనారాయణ రాజు, పులిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పశుగణన పై దృష్టి సారించాలి

పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి

విశాలాంధ్ర – సీతానగరం: క్షేత్రస్థాయిలో పశుగణన పై దృష్టి సారించాలని తూర్పు గోదావరి జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి అన్నారు. శనివారం మండలంలో కాటవరం, వెద్దుళ్ళ పల్లి, చినకొండేపూడి గ్రామాల్లో పశుసం వర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి ఆకస్మిక పర్యటన చేశారు. పశుసంవర్ధక శాఖ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే క్షేత్ర స్థాయిలో మండల పశుసంవర్ధక డాక్టర్ ఫణీంద్రతో కలిసి పర్యటించి రైతులతో మాట్లాడి వారి అనుమా నాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐదు సంవత్సరాలకు ఒక సారి పశు సంపద గణనను నిర్వహించి దీనిప్రకారం గ్రామాల్లో మందులు, వైద్య అధికారులను అందుబాటులో ఉంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, పశుసంవర్ధక సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలు భక్తి భావాలకు ప్రతీక

విశాలాంధ్ర – రంగంపేట : కార్తీక మాసంలో నిర్వహించే వన సమారాధనలు భక్తి భావాలకు ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో గ్రామ వైసిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇంతటి కార్యక్రమం నిర్వహించడం అంటే చాలా ఆర్థిక భారంతో కూడుకున్న కార్యక్రమం అని ఇటువంటి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా 24 ఏళ్ళగా వేలాది మందితో నిర్వహించిన రామవరం గ్రామ వైఎస్ఆర్ సిపి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అభినందనీయులని అన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

విశాలాంధ్ర – సీతా నగరం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని డివైఈఓ నారాయణ అన్నారు. మండలం లో వెదుళ్ళపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి డి వై ఈ ఓ నారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పదవ తరగతి విద్యార్థులను తమ సబ్జెక్టులో పలు ప్రశ్నలు అడిగి వారిని పరీక్షించారు. అలాగే వారు రాసిన ప్రశ్నపత్రాలను పలు సందేహాలను వ్యక్తం చేస్తూ విద్యార్థులను ప్రశ్నించారు. అలాగే వారికి బోధన చేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో క్షుణ్ణంగా బోధించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో బోధన ప్రయివేటు పాఠశాలకు దీటుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ వి శ్రీనివాస రావు, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర – కొవ్వూరు : పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఆరో వార్డు నందు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గం నుండి 19 మంది లబ్ధిదారులకు 11, 26,315 రూపాయలు కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సూర్యదేవర చిన్ని, 19 వార్డు కౌన్సిలర్ కిలాని వీరలక్ష్మి, తెలుగుదేశం నాయకులు పొట్రు శ్రీనివాస రావు, మద్దుకూరి సురేష్, పెనుమాక జయరాజు, బొబ్బిలి పేర్రాజు, వీరభద్రరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెల్లి అశోక్‌కు నేతల సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సీనియర్ టిడిపి నాయకుడు చెల్లి అశోక్‌ను పలువురు అభినందనలతో ముంచెత్తుతున్నారు. అయినవిల్లి మండల టిడిపి అధికార ప్రతినిధి మెల్లం సత్యనారాయణ, నక్కా రామకృష్ణ తదితరులు శనివారం అశోక్‌నూ ఆయన స్వగృహంలో కలిసి అభినందించారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుమ్మళ్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు. మాలలు సంక్షేమం కోసం నిరం తరం పాటుపడే చెల్లి అశోక్‌కి రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవి నిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బుచ్చి బాబుకు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

ఓటు హక్కు తప్పనిసరి : తహశీల్దార్

విశాలాంధ్ర - ఆలమూరు : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని తహశీల్దార్ కేజే ప్రకాష్ బాబు అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాథమిక హక్కని, ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మండలంలోని స్థానిక బూత్ సెంటర్లలో బూతు లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టర న్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తా : ఎంపీ తంగెళ్ల

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 20 వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఢిల్లీకి పయనమయ్యారు. అంతకుముందు శుక్రవారం మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పార్లమెంట్‌లో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో కూటమి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా పోరాడుతామన్నారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టులు మంజూరుతో పాటు,పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా కేంద్ర సహకారం కోరతానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల్లో వైసిపి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి తమ అధినేత కోసం మాత్రమే పోరాడారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎన్డీవీ కూటమి ఎంపీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

అర్థాంతరంగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రౌతులపూడి : శనివారం నిర్వహించిన రౌతులపూడి మండల సర్వసభ్య సమావేశం వివిధ శాఖలపై సమీక్ష జరగపకుండానే ముగించారు. ఎంఎల్సీ ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున ప్రజా సమస్యల పరిష్కారం మరి ఇతర అభివృద్ధి పనులపై చర్చ జరగలేదని అధికారులు తెలిపారు. ఎంపీటీసీలు పాల్గొనగా నామ మాత్రపు చర్చలు జరిపి సభలో ముగించి వేశారు. ప్రజాధనం వృధా ఖర్చు చేశారు. ప్రజలకు ఏమీ ప్రయోజనం లేదు అని కొందరు విమర్శిస్తున్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - గోపాలపురం : రైతు-కూలీల, శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా , అఖిల భారత కార్మిక సంఘాల సమన్వయ సమితి నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు. శనివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం (ఆంధ్ర) ఆధ్వర్యంలో మండలంలోని దొండపూడి, రాజంపాలెం, సాగిపాడు గ్రామాలలో ప్రదర్శన నిర్వహిస్తూ కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. దొండపూడి సంత బజారు వద్ద ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలీ సంఘం (ఆంధ్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం రైతాంగానికి ఇచ్చిన హామీలను వేటిని నెరవేర్చలేదని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను తొలగించి కార్పొరేట్ శక్తులకు, సామ్రాజ్యవాదులకు మేలు చేకూర్చే నాలుగు లేబర్ కోడలను తీసుకొచ్చారని అన్నారు. వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాదుల దోపిడీ తీవ్రంగా పెరుగుతోందని దీని ఫలితంగానే రైతాంగ ఆత్మహత్యలు నానాటికి పెరిగి పోతున్నా యని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యవసాయ అనుబంధ పరిశ్రమల మూసివేత విధా నాలకు వ్యతిరేకంగా కూడా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు, రైతు కూలీ సంఘం నాయకులు ముప్పిడి రాజారత్నం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నన్నయలో ఇషా గ్రామోత్సవ క్రీడలు

విశాలాంధ్ర - రాజానగరం : గ్రామీణప్రాంత క్రీడాకారు లను వెలుగులోకి తెచ్చేందుకు ఇషా గ్రామోత్సవ క్రీడలు దోహద పడతాయనీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వేదికగా,వర్సిటీ ప్రాంగణంలో 16వ ఇషా గ్రామోత్సవం భారతదేశ క్రీడా స్ఫూర్తి రూరల్ ప్రీమియం లీగ్ 2024 సౌత్ ఇండియా లెవెల్ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఉపకులపతి వాలీబాల్ పురుష జట్టు విభాగంలో సర్వీస్ చేసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గ్రామాలు గ్లోబల్ విలేజ్‌లుగా మారుతున్న తరుణంలో మన సంస్కృతి,సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, ఈ నేపథ్యంలో ఇషా ఫౌండే షన్ నిర్వహిస్తున్న గ్రామోత్సవ క్రీడలు సమాజానికి ఎంతో అవసరమన్నారు . ఇషా గ్రామోత్సవ క్రీడా పోటీలు నిర్వాహకులు మాట్లాడుతూ రూరల్ ప్రీమియం లీగ్ 2024 లో భాగంగా ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో పురుషులకు వాలీబాల్, మహిళాకు త్రో బాల్ క్రీడలు జరుగుతున్నా య న్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి క్రీడాకారులు హాజరయ్యారని,వారిలో పురుషులు వాలీబాల్ విభాగంలో 29 జట్లు, మహిళలు త్రో బాల్ విభాగంలో 15 జట్లు రిజిస్టేషన్లు జరిగాయన్నారు. పోటీ ల్లో గెలుపొందిన విజేతలకు పురుషుల విభాగంలో ప్రథమ,ద్వితీయ, తృతీయ జట్లుకు రూ. 9 వేలు, రూ. 6 వేలు, రూ. 3 వేలు,నాల్గవ బహుమతి రూ. 2 వేలు, మహిళలు విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఐదువేలు, మూడు వేలు, రెండు వేలు, నాల్గవ బహుమతి పదిహేను వందలు రూపాయలు అందజేస్తారు. ఫైనల్ మ్యాచెస్ మాత్రం కోయంబత్తూర్‌లోని ఈషా ఆశ్రమంలోని ఆదియోగి ముందు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పిఓ డిఎం ఎం.శేషగిరి,ఇషా ఫౌండేషన్ వలంటీర్లు,క్రీడాకారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో నాన్ టీచింగ్ సిబ్బందికి ఎస్ఆఫీస్‌పై శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకి నాడ (యుసిఇకె) పరిపాలనా భవనంలోని పిజి రీసెర్చ్ ల్యాబ్‌లో రెండు రోజుల పాటు నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహించనున్న ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ పి సుబ్బారావు, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ సేల్స్ హెడ్ ఎం వెంకటేష్ విచ్చేశారు. శిక్షణా కార్యక్రమానికి ఎస్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ వివికె.కశ్యప్, సిఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె రఘురామ్‌లు కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ పి సుబ్బారావు, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ సేల్స్ హెడ్ ఎం వెంకట్ మాట్లాడుతూ సిబ్బందికి పలు అంశాలను చర్చించారు. ఎంఎస్ ఆఫీస్‌పై రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో వివిధ సాంకేతికతలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఐపిటి డైరెక్టర్ ప్రొ బిటి కృష్ణ, ఐఒడబ్ల్యుఙ డైరెక్టర్ ప్రొ యువి రత్నకుమారి, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ నుండి రిసోర్స్‌పర్సన్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం ఆలమూరు కోర్టు ప్రాంగణంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పులతో సమానం అన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని కోర్టులలోను డిసెంబర్ 14న జాతీయ లోక్ దాలత్‌ను ఏకకాలంలో నిర్వహిస్తారన్నారు. రాజీ చేయదగిన కేసులన్నీ పరిష్కరిస్తామన్నారు. తీర్పు వల్ల కక్షిదారులు ఒక్కరే విజయం సాధిస్తే, లోక్ అదాలత్లో ఇరువర్గాలు రాజీ కావడంతో ఇరువురు విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, కోర్టుసిబ్బంది,న్యాయవాదులు పాల్గొన్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలి సీఐటీయూ డిమాండు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఈనెల 16వ తేదీన అర్ధాంతరంగా మూసివేసిన ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మూతపడ్డ ఫ్యాక్టరీ ఎదుట గత 8 రోజులుగా ధర్నాలు నిర్వహిస్తున్న కార్మికులను కలిసి ఈశ్వరరావు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీని యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేయటంతో కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫ్యాక్టరీలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని చెబుతుండగా ఫ్యాక్టరీని మూసేసి 24 గ్రామాలకు చెందిన కార్మికుల ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించి వెంటనే ఫ్యాక్టరీ తెరిపించాలని, లేని పక్షంలో ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కొనసాగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిశెట్టి వీరబాబు, వి రాజేష్, గంగ రాజు, చక్రధర్, దుర్గాప్రసాద్, వి వీరబాబు, ఎస్ జయలక్ష్మి, వై శివవరలక్ష్మి, కె కృష్ణవేణి , కార్మికులు ఉన్నారు.

సత్య సాయి బాబా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ, అల్లవరం : కోమరగిరిపట్నం గ్రామంలో శ్రీ సత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం పంచారామ ఆలయం ఎదురుగా ఉన్న సాయిబాబా కమ్యూనిటీ హాలులో 99వ జన్మదిన వేడుకలు కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1987లో సినీ నిర్మాత డివిఎస్ఎన్ రాజు శంకుస్థాపన చేసి 91 నాటికీ బిల్డింగ్ ప్రారంభం చేశారు. స్వయంగా ఆనాడు పుట్టపర్తి నుంచి సాయిబాబా ఫోటోను తెచ్చి ఆనాటి నుండి ఈనాటి వరకు పుట్టపర్తిలో ఏ సేవలు అయితే జరుగుతున్నాయో అలాగే కొమరగిరి పట్టణంలో కూడా జరుగుతున్నాయి కమిటీ వారు తెలిపారు.

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ సంబరాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : జార్ఖండ్‌లో బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పి ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకు వచ్చారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు అన్నారు. ప్రత్తిపాడు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో లిబరేషన్ కార్యకర్తలు జార్ఖండ్‌లో ఇండియా కూటమి అధికారంలోకి రావడంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బంగార్రాజు మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలో సింద్రీ మరియు నిరసన అసెంబ్లీ నియోజకవర్గంల నుండి ఎన్నికల సిపిఐ ఎంఎల్ అభ్యర్థి ఫలితాల్లో జార్ఖండ్ రాష్ట్రంలో సింద్రీ మరియు నిరస అసెంబ్లీ నియోజకవర్గంల నుండి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా పోటీ చేసిన అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిచారన్నారు. కామ్రేడ్ చంద్రదేవ్ మహతో, అరూప్ చటర్జీ పార్టీ అభ్యర్థిలుగా గెలుపొందడం జరిగింది. ఇండియా కూటమిలో భాగంగా బిజెపిని నిలువరించే కలిగే శక్తి కేవలం ఇండియా కూటమి ఉందని ఫాసిజానికి వ్యతిరేకంగా జరుగుతున్నటువంటి పోరాటంలో లిబరేషన్ పార్టీ చురుకైన పాత్ర పోషించి జార్ఖండ్ ఎన్నికల్లో మూడు స్థానాలకు పోటీ చేసిందన్నారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గ నుండి గెలుపొందడం, జార్ఖండ్‌లో బిజెపి వ్యతిరేక ప్రభుత్వం ఏర్పాటు చాలా సంతోషం అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు అన్నారు. ఈ సందర్భంగా మానుకోండ లచ్చబాబు ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మానుకొండ లోవమ్మ, పిల్ల ప్రభుదాసు, నేతల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి,కుమారుడు దారుణ హత్య

విశాలాంధ్ర - మండపల్లి : మండలం లోని గన్నవరం గ్రామం లో తల్లి కొడుకుల హత్య సంచలనం రేకెత్తించింది. కేసులో నిందితులు ఎవరనేది మిస్టరీ గా మిగిలింది. అర్ధరాత్రి సమయంలో గన్నవరం గ్రామంలో నివాసముంటున్న రొయ్యూరు భ్రమరాంబ (60), రొయ్యూరు సురేష్ (26) తల్లి కొడుకు దారుణ హత్య వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న మండపల్లి ఎస్ఐ సిహెచ్ సూర్య రామచంద్ర రావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు. భ్రమరాంబ ను తలపై కొట్టి గొంతు కోసి, కొడుకు సురేష్ ను గొంతు కోసి హతమార్చినట్టు నిర్ధారించారు. సంఘటనపై డీఎస్పీ వివరణ కోరగా ఆస్తి తగాదాలే హత్యలకు కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన దీని వెనక అసలు సూత్రధారులు ఎవరనేది తెలియాల్సి ఉందన్నారు.

బస్ సర్వీసును సద్వినియోగం చేసుకోండి
డిపో మేనేజర్ షేక్ షబానా

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : శబరిమల యాత్ర బస్ సర్వీ సులను అయ్యప్ప స్వాములు సద్విని యో గం చేసుకోవాలని రాజమహేంద్ర వరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబానా అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్ర వరంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ప్రాంగణం నుండి శబరిమలకు సూపర్ లగ్జరీ తొలి బస్సును డిపో మేనేజర్ షేక్ షబానా శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో డిఎం షబానా మాట్లాడుతూ అయ్యప్ప స్వాములు, భక్తులు కోసం ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సేవలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

డిసెంబర్ 30న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఓటర్ల తుది జాబితా

- అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ సీతారామమూర్తి సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు, పశ్చిమ గోదావరి ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లగా 51,624 మంది గ్రాడ్యుయేట్స్ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని రాజమహేంద్రవరం డిఆర్ఓ సీతారామమూర్తి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ సీతారామమూర్తి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై శనివారం సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్ సి పట్టభద్రుల ఓటర్ల గా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దరఖాస్తులు నవంబర్ 23 వ తేది నాటికి 51,624 దరఖాస్తు వచ్చాయని, ఇందులో పురుషులు 30292 మంది, మహిళలు 21328 మంది ఇతరులు 14 మంది ఉన్నార న్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా డిసెంబర్ 9 వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపారు. గతంలో కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు పెరుగు తాయన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్ని ప్రభుత్వం భవనాల్లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2 కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 4 పోలింగ్ స్టేషన్లు ఒక ప్రదేశంలో అనుమతించడం జరగదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మరుగు దొడ్డు, ఫర్నిచర్, పిడబ్ల్యుడి ఓటర్లకు ర్యాంప్‌లు వంటి కనీస ప్రాథమిక సౌకర్యాల లభ్యతను సమకూర్చామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు సిపిఎం పార్టీ తర పున కర్రి రామకృష్ణ, బీఎస్పీ పార్టీ తరఫున పులగల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము, మహిళా పోలీసులతో కలిసి ర్యాలీ గ్రామం హైస్కూల్‌లో మహిళా సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మహిళా భద్రత, హక్కులు, సమాజంలో వారి పాత్ర, ఇంకా ప్రమాద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా, సెల్‌ఫోన్ ద్వారా సహాయం పొందే విధానాలు, డయల్ 100 సేవల ప్రాముఖ్యత, మరియు సైబర్ నేరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం పై వివరణ ఇచ్చారు. పోలీసులు, సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తూ మహిళల భద్రతను కాపాడటం గురించి స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా మహిళా హక్కులపై కొత్త విషయాలు నేర్చుకున్నారు. మహిళా పోలీసుల పాత్ర, సమాజంలో మహిళలకు అందించే భద్రత పై అవగా హన పెరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరగడంతో ఆ గ్రామ ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రం యూనిట్‌గా ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఎస్సి వర్గీకరణను జిల్లా యూనిట్‌గా తీసుకోవడంవల్ల మాదిగలు తీవ్రంగా నష్టపోతారనీ మాదిగ రిజర్వే షన్ పోరాట సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్య క్షులు తెన్నేటి కిషోర్ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో నిర్వ హించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఉభయ గోదావరి జిల్లాల మాదిగలతో పాటు వివిధ జిల్లాల్లో వున్న మాదిగలు తీవ్రంగా నష్టపో తారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయ దుకి విజ్ఞప్తి చేస్తున్నామని, గతంలో మీరు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు 1997 జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ రిపోర్టు ఆధారం గా షెడ్యూల్ కు లాల వర్గీకరణ ఏ విధంగా అమలు చేసారో అదే విధంగా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరు తున్నామని అన్నారు. గ్రూప్ ఎ, గ్రూప్ బి అధి కారుల ప్రమోషన్స్‌లో మాదిగలు తీవ్రంగా నష్టపో తారని అన్నారు. జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ 21-5-2007న నియ మించబడినదని, ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కమ్యూనిటీ రిజర్వేషన్ ఉప-వర్గీకరణను అమలు చేయడానికి అదే నివేదికను సమర్ధించ వచ్చని, దాని ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేయవచ్చు కాబట్టి ముఖ్యమంత్రి గతంలో వర్గీకరణ అమలు అయిన విధంగానే ఇప్పుడు కూడా అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్ర మంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఈత కోట రాజు, అంబేద్కర్ కాన్సన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొడమంచిలి సాయికుమార్, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, నామవరపు సత్యనారా యణ, తొత్తరమూడి ఆనంద్, ఈతకోట అనిల్, పద మంచిలి తాతాజీ, మురళీకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి 'పోర్షన్ వాటిక' పథకం

విశాలాంధ్ర - పెదపూడి : కాకినాడ అర్బన్ ప్రాజెక్టుకు చెందిన పెదపూడి మండలం పెద్దాడ సెక్టార్ గొల్లల మామిడాడ ఎస్సీ పేటలో 136, 137 అంగన్వాడి సెంటర్‌కు పోషణ్ వాటిక పథకంలో భాగం గా న్యూట్రి గార్డెన్ మంజూరు అయింది. మండలంలో 11 అంగన్వాడీ సెంటర్స్‌కు ఈ స్కీమ్ అమలు అయింది. ప్రభుత్వం సిట్రస్ జాతికి చెందిన సి విటమిన్ గల ఉసిరి, జామ మొక్కలు పెంచి మొక్కల నుండి వచ్చే ఫల సాయం అంగన్వాడి పిల్లలకు అందించి ఆరోగ్యవంతమైన జీవితం ఇవ్వడమే పోషణ్ వాటిక ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా ఈఓపిఆర్డి ఎమ్మెస్ ఎన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కనకనాగేంద్ర కొన్ని రకాల ఆకుకూరల విత్తనాలు అంగ న్వాడి సెంటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ గంగాభవాని, సిహెచ్ ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పోడూరు మండలం నంబూరి వారి గరువు గ్రామానికి చెందిన **పమ్మి పాప, W/o. తాతారావు** అను నేను పోడూరు గ్రామం నుండి కొత్తపేట ఆటోలో వస్తుండగా హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న **E3319067** నెంబరు గల పాస్‌పోర్ట్ మార్గ మధ్యలో పడిపోయినది దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించవలెను.

పమ్మిపాప, C/O. జంగా సీతామహాలక్ష్మి
చిక్కాలవారి పేట,
మోడేకుర్రు కొత్తపేట మండలం,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 9381233285

శెట్టిబలిజ వన సమారాధనను విజయవంతం చేయాలి

మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : శెట్టిబలిజ కార్తీక వన సమారాధనను విజయవంతం చేయాలని కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ సోదరులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీరామపురంలోని మంత్రి నివాసంలో శనివారం జరిగిన విలేఖర్ల సమావేశంలో మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు. కొంకాపల్లిలోని శ్రీ సత్తెమ్మ చెట్టు ఆలయం వద్ద జరగనున్న వనసమారాధన కార్యక్రమం పార్టీలకు అతీతంగా జరుగుతుందని, ఉభయ గోదావరి జిల్లాల నుండి వచ్చే శెట్టిబలిజ సోదరులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వనసమారాధనకు ఈ సంవత్సరం అత్యధికంగా శెట్టిబలిజ సంఘీయులు, మహిళలు, యువకులు రానున్నారని, దీనికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనాల నిలుపుదలకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేసినట్టు వాసంశెట్టి సత్యం తెలియజేశారు. ఈ సందర్భంగా డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండే కాకుండా ఉభయ రాష్ట్రాల నుండి శెట్టిబలిజ నాయకులు, సోదరులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా యువకులు ఏ పార్టీ జెండాలు ఈ వనస మారాధనలో ప్రదర్శించకూడదని, మోటార్ వాహనాలు సైలెన్సులు తీయడం వంటి పనులు చేయరాదని ఆయన తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ మంత్రి చెప్పిన విధంగా పార్టీలకతీతంగా శెట్టిబలిజ ఐక్యతను చాటేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పెచ్చెట్టి చంద్ర మౌళి, మట్టపర్తి నాగేంద్ర, మామిడిశెట్టి శివరామ ప్రసాద్, చెల్లు బోయిన రాంబాబు, రాయుడు సత్య రుషి, గుత్తుల శ్రీనివాస్, బొంతు సత్తిబాబు, దొంగ శ్రీను, వాసం శెట్టి జగదీష్, అనిశెట్టి శ్రీనివాస్, రెడ్డి శివాజీ, చొల్లంగి వెంకటరమణ, దంగేటి శ్రీనివాస రావు, వాసంశెట్టి చినబాబు చొల్లంగి అప్పాజీ, దొంగ కుమార్, ఎస్ఏఎఫ్ యువత పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌తో మల్లాడి కృష్ణారావు భేటీ

విశాలాంధ్ర - యానాం : యానాం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అంతరాష్ట్ర సమస్యలపై శుక్రవారం విజయవాడలోని సీఎం చాంబర్‌లో చర్చ...సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు, పవన్‌లకు వినతి, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్‌ల తోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, బందారు సత్యానందరావు, దాట్ల బుచ్చిబాబు, అయిత బత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, నాయకర్లతో పాటు పిఠాపురం వర్మ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా యానాంకు ప్రజల అవసరం నిమిత్తం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని సీఎం చంద్రబాబును కోరినా మల్లాడి. కాకినాడ మల్లాడి సత్యలింగం నాయకర్ చారిటీస్ భూము లు అన్యాక్రాంతం అవుతున్నా యని ఎవరెవరి చేతుల్లో ఎంతో ఉన్నది అనే వాటికి సంబంధించి పూర్తి విచారణ నిర్వహించి వివరాలు తెలపాలని సీఎంను కోరారు. పురాతన కాలం నాటి అంతర్వేది ఆలయంకు సంబంధించి వారసులనే ధర్మకర్తలుగా నియమిం చాలని మల్లాడి కోరారు. సముద్రంలో చమర సంస్థలు ఆయిల్ వెలికితీతకు సంబంధించి ప్రభుత్వం అనుమతులు ఇచ్చేముందు సమీపంలో ఉన్న మత్స్యకారులకు ఎటువంటి తారత మ్యం షరతులు లేకుండా పరిహారం అందించే చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మల్లాడి వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అమ లాపురం : గత ప్రభుత్వం లో ముఖ్య మంత్రి జగన్మో హన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ముమ్మిడి వరం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు తమ గోడు వెళ్లబోసుకోనగా స్థానిక ఎమ్మెల్యే నాటి జిల్లా కలెక్టర్‌కి అప్పగించి వారి సమస్యలు న్యాయమైనవి వారికి న్యాయం చేయమని ఆదేశించారు. ముమ్మిడివరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మి కులు మాకు ఆప్కస్‌లోకి లేదా వికాస్‌లోకి తీసుకొని మా జీవన ప్రమాణాలు పెం పొందించాలని వేడుకొంటే ఉన్న బదిలీ ఉద్యోగాలు ఊడదీసారని కూటమి ప్రభుత్వం వార్డు లెక్క ప్రకారం లేదా జనాభా ప్రాతిపదికన కార్మికులు సంఖ్య పెంచాలని కోరుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి వెల్లడించారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నాకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, బుంగ కుమార్ కో భార్గవ రాజు, కాకి రాంబాబు, పలివెల నాగలక్ష్మి, సిఐటియు నాయకులు నిమ్మకాయల వెంకటేశ్వర, నాయకత్వం వహించారనీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ. నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపారు.

కిశోర వికాస శిక్షణా కార్యక్రమాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : యుక్తవయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాస కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, శిక్షణ కార్యక్రమం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించడం లో ప్రధాన పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శని వారం స్థానిక ప్రకాష్ నగర్ ధర్మచర కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కిశోరి వికాశం జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, రాజ్యాంగం లో పొందు పరిచిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా పిల్లలకు తెలియ చేయాలన్నారు. ప్రభుత్వ మహిళా సాధికారత, మహిళల అభివృద్ధిపై అనేక కార్యక్రమాలు చేపడు తుందన్నారు. జాతీయస్థాయిలో నల్సా రూపొం దించిన మార్గదర్శకాలను జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ ద్వారా మహిళలకు, పేదరికంలో ఉన్న మహిళలకు న్యాయపరంగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సుప్రీం కోర్టు, హై కోర్టు ఆదేశాలను అనుసరించి డిఎల్ఎస్ఏ కార్యక్రమాలు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయంతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై జిల్లాలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ సమన్యాయం అందించేందుకు మండల స్థాయిలో పారా లీగల్ వాలంటీర్లు, లీగల్ ఏయిడ్ క్లినిక్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పునః ప్రారంభ కార్యక్రమం పునాది వేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ కిశోరి బాలికలు బాల్యం . ఈ కార్యక్రమంలో డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఐసిడిఎస్ పిడి కె. విజయలక్ష్మి, డీఈఓ. కె. వాసుదేవ రావు, డిఎంహెచ్ ఓ డా. కే వెంకటేశ్వరరావు, డి సి హెచ్ ఓ డా.ఎన్ పి పద్మశ్రీ, ఎస్ ఎస్ ఏ పిడి ఎస్. సుభాషిణి, డిఎస్పీ భవ్య కిశోర్, జిల్లా వొకేషనల్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డా.హరిహర, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధి.కారి సి.రాజ్‌కుమార్,ఐసిడిఎస్, మండల స్థాయి అధికారులు విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివ కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న తరుణంలో శనివారం సిఆర్‌రెడ్డి కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహా సభల గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని,బ్రిటిష్ పాలకులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలనిన్న లక్ష్యంతో, స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 49వ రాష్ట్ర మహాసభలకు విజయనగరం వేదిక కానుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.2500 కు పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనాలు గుర్తించి తక్షణమే సొంత భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో ఉన్న సమస్యలపై విజయనగరంలో జరుగుతున్న మహాసభలలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు ఈ మహాసభలు వేదిక కానుం దని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రకాష్, ధనంజయ్ పాల్గొన్నారు.

సైబర్ నేరంలో తస్కరించిన

రూ.3.14 లక్షలు రికవరీ : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : సెల్‌ఫోన్ చోరీ చేసి అందులో ఉన్న పాస్వర్డ్ ఆధారంగా 3.14 లక్షల రూపాయలు సైబర్ నేరగాళ్లు అపహరించ దంతో వెంటనే పోలీసులు అప్రమత్తమై గంట తేడాలో ఆ నగదును తిరిగి బాధితుడికి అందజేసిన సంఘటన ఏలూరులో చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వేదాంతి రామానుజ ఆచారి సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అనంతరం ఆచారి తన ఫోన్‌లో సేవ్ చేసిన పాస్వర్డ్, యూజర్ నేమ్ ఉపయోగించి నేరగాళ్లు రూ. 3,14,000 లక్షలు ఆచారి బ్యాంక్ ఖాతా నుండి వేరొక బ్యాంకు ఖాతాకు మళ్ళించారు. దీంతో అప్రమత్తమైన బాధితుడు ఆచారి వెంటనే 1930కి ఫిర్యాదు చేశారు. ఆచారి ఇచ్చిన ఫిర్యాదు పై ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సైబర్ సెల్ ఎస్సై మధు వెంకట రాజా దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే తస్కరణకు గురైన సొమ్మును గంట వ్యవధిలో బ్యాంక్ అధికారుల సహాయంతో అకౌంట్ లో ఉన్న డబ్బును, ఫ్రీజ్ చేసిన డబ్బును రికవరీ చేసి మొత్తం రూ.2,81,400 లక్షలు బాధితుడికి తిరిగి చెల్లించారు. ఈ సంఘటనపై వేదాంతి రామానుజ ఆచారి శనివారం ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీని కలిసి తన అజాగ్రత్తతో జరిగిన సంఘటనలో పోగొట్టుకున్న డబ్బును తిరిగి తనకు ఇప్పించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అదానీ కుంభకోణంపై చట్టపరమైన ప్రక్రియ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

విశాలాంధ్ర - భీమవరం: అదానీ గ్రీన్ ఎనర్జీ కుంభకోణంపై చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పితృవియోగమునకు గురికావడంతో ఆయనను పరామర్శించడానికి శనివారం భీమవరం వచ్చిన పురంధేశ్వరి బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కాలంలో చత్తీస్‌గఢ్‌లో బిజెపి ఇతర పార్టీలు ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు, అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాయని,కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలకు అదానీ గ్రీన్ ఎనర్జీతో కుంభకోణాలతో ఎటువంటి సంబంధం లేదని పరోక్షంగా పురంధేశ్వరి తెలియజేశారు. సమావేశంలో తణుకు శాసనసభ్యులు రాధాకృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు తాతాజీ, పేరిచర్ల సుభాష్, రవికుమార్ కాయిత సురేంద్ర , వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా బాబా జన్మదినం

విశాలాంధ్ర - గోపాలపురం : శ్రీ పుట్టపర్తి సత్య సాయి బాబా జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక గోపాలపురంలోని సాయిబాబా భక్తులు ఉదయాన్నే బాబా సంకీర్తనలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక గోపాలపురం లోని కర్లపూడి చిన్నబాబు జలావతి దంపతులు ఆర్థిక సహాయంతో సాయిబాబా 99వ పుట్టినరోజు సందర్భంగా 99 మంది వృద్ధులకు వితంతువులకు దుప్పట్లు అంద జేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు బొమ్మ రెడ్డి రాణి, మద్దిపాటి శశిదేవి, బాల భాస్కరరాజు, గేదెల మంగాయమ్మ, బాబా భక్తులు పాల్గొన్నారు.

వాడపల్లి దివ్య క్షేత్రంలో భక్తుల సందడి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామిని శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తదనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుంచి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేం ద్రవరం, గోకవరం విజయవాడ, విశాఖపట్నం నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.41,63,176లు సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెంట్ పి రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కడియం నర్సరీ అసోసియేషన్‌కు సత్కారం

విశాలాంధ్ర, కడియం : మహారాష్ట్రలోని పూణేలో జరిగిన హార్టీప్రో ఇండియా 2024 నర్సరీ ఎక్స్పోలో కడియం నర్సరీ రంగం తరుపున సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లుపొలరాజు, కార్యవర్గ సభ్యులను మహారాష్ట్ర నర్సరీ మెన్ అసోసియేషన్ అధ్యక్షులు శశికాంత్ చౌదరి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెదర్లాండ్‌కు చెందిన మార్టిన్ లెయూన్ కడియం నర్సరీ అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి గట్టా కృష్ణ భగవాన్, రావిపాటి రామకృష్ణ, డైరెక్టర్లు తాడాల నాగేశ్వరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీనివాస్, కొండేపూడి నాగు పాల్గొన్నారు.

ల్యాండ్ బ్యాంక్ వివరాలు అందజేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: జిల్లాలో ల్యాండ్ బ్యాంక్, అసైన్డ్ ల్యాండ్‌కు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాలని తహసీల్దార్లను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులతో వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్ట్‌లు,చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భూసేకరణ పనులను సంబంధిత ఆర్డీవోలు ఎప్పటికప్పుడు సంబంధిత తహశీల్దార్లతో సమీక్షించి వేగవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, తదితర ప్రాధాన్యత అంశాలకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణకు సంబంధించి కోర్టులలో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కైకలూరు డంపింగ్ యార్డు, నూజివీడు, జంగారెడి గూడెం ఎస్ టిపిలకు సంబంధించి భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరిక

విశాలాంధ్ర - కాకినాడ : బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మహిళ గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవారం సురక్షితంగా తిరిగి స్వదేశానికి వచ్చింది. భర్త చనిపోయి, ఇళ్లు గడవడం కష్టమైన పరిస్థితులల్లో తన ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం ఈమె పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ యం సుధాకర్ ద్వారా గత మే నెల 1న ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. కువైట్ దేశంలో 30 వేల జీతంతో ఇంటి పనులు చేసేందుకు ఉద్యోగంలో చేరింది. అయితే తాను పనిచేసే యజమాని తీవ్ర ఇబ్బందులకు, చిత్రహింసకు గురిచేయడంతో నరక యాతనకు లోనైంది. ఉపాధి కోసం వెళ్లి విదేశాలలో నానా యాతనలు పడుతున్న వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుని, దేశం కాని దేశంలో తాను పడుతున్న అవస్థలను వీడియోగా చిత్రీకరించి, తన సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి పంపింది. హృదయ విదారకమైన ఆమె దీన పరిస్థితికి చలించిన మంత్రులు ఇరువురు కువైట్‌లోని భారత రాయభార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి

వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఇరువురి చొరవతో గారా కుమారి కువైట్ నుండి విమానంలో హైదరాబాదు చేరుకుని, శుక్రవారం రాత్రికి తన సొంతూరు యల్లమిల్లిలోని తన ఇంటికి చేరుకుంది. ఆమె రాకతో ఎదురు చూస్తున్న పిల్లలు, కుటుంబ సభ్యులు పొందిన ఆనందానికి అవధులు లేవు. కష్టాల చీకటిలో కొట్టాడుతున్న తమ కుటుంబానికి కొండంత అండగా నిలచి ఆదుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు గారా కుమారి, ఆమె కుటుంబ సభ్యులు చేతులెత్తి నమస్కరిస్తూ వారికి సదా రుణపడి ఉంటామని తెలియజేశారు. తాను తిరిగి స్వదేశానికి రావడానికి ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి, జిల్లా యంత్రాంగానికి గారా కుమారి ధన్యవాదాలు తెలియజేసింది.

అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన అనేక పనులను తూర్పుగోదావరి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఏ నాగ మహేశ్వరరావు. శనివారం మండలంలో కాటవరం, బొబ్బిల్లంక గ్రామ పంచాయతీల పరిధిలో పశువుల షెడ్లు (గోకులాలు), అంగన్వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్న రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నాగ మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారాతో పాడి రైతులకు మేలు చేకూరే విధంగా గోకులాల మంజూరు చేసిందన్నారు. అలాగే అంగన్వాడీ

కేంద్రాల వద్ద వర్షపు నీరు వృథా కాకుండా రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నమూనాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఓ కె.నాగశేషవేణి, టీ.ఏ.లు చక్రవర్తి, వీరబాబు, ఎఫ్.ఏలు, అంగన్వాడి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర -నల్లజర్ల : పోతవరం గ్రామంలో క్రీస్తు సువార్తను అనేకమంది ప్రజలకు తెలియజేస్తూ దేవుని ప్రేమను గురించి ఆయన పుట్టుక మరణ పునరుద్దానం గూర్చి తెలియజేస్తూ పెద్ద సంఖ్యలో భక్తులు అనేకమంది పాల్గొన్నారు. యేసును గూర్చి పాటలు పాడుతూ నాలుగు రోడ్ల కూడలిలో వాక్యమును ప్రచురిస్తూ ప్రార్థనలు చేస్తూ పోతవరం గ్రామం అంతటా ఏసుక్రీస్తు గురించి తెలిపారు. భక్తులు విశ్వాసులు అనేకమంది ప్రజలకు కరపత్రికలు పంచుతూ అనేకమందిని దేవుడు లోనికి నడిపిస్తూ ముందుకు కొనసాగారు. ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు, విశ్వాసులు, చిన్నపిల్లలు పాల్గొన్నారు. గోపినాథ్ ఆధ్వర్యంలో ఈ దండయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు పోతవరంలో ఉన్నటువంటి సంఘ బిడ్డలు అనేకమంది పాల్గొన్నారు. నశించిపోతున్న ఆత్మ రక్షించాలని అనేటువంటి తాపత్రయంతో దేవుని సేవకులు భక్తులు అనేక మంది క్రీస్తును గురించి తెలిపారు.

గౌడ కార్తీక వనసమారాధనను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర -మండవల్లి: 25న సోమవారం మండవల్లి మండలం భైరవపట్నం గ్రామం శోభనాద్రిపురం అగ్రహారం శివాలయం నందు నిర్వహించనున్న కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘ 20వ కార్తీక వన సమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు, బొర్రా చలమయ్యలు పిలుపునిచ్చారు. శనివారం భైరవపట్నం గ్రామంలో సమారాధన ఏర్పాట్లపై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మంత్రి అనగాని సత్యప్రసాద్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తిలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం నూతనంగా పదవులు పొందిన ముఖ్య అతిథులకు సత్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని గౌడ సోదరు లందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి వన సమారాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘ నేతలు పరస ఏడుకొండలు, మన సమారాధన కమిటీ చైర్మన్ పడమట గణేష్ బాబు,కట్టా నాగబాబు, మేకా విజయ్, కట్ట జగన్ లు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో బ్రొసెల్లోసిస్ నివారణ

విశాలాంధ్ర - ఆలమూరు : 4 నుండి 8 సంవత్సరాల వయసులో గల పుట్టిన ప్రతి చిన్న ఆడ దూడకు బ్రొసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా మందు వేయించినట్లయితే బ్రొసెల్లోసిస్ వ్యాధిని అరికట్టవచ్చని పశుసంవర్ధక శాఖ ఏడిఎల్ అనిత అన్నారు. శనివారం ఆమె మండలంలోని పలు గ్రామాలలో రైతుల సమక్షంలో గేదె, ఆవు ఆడ దూడలకు బ్రొసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను పశుసంవర్ధక శాఖ డాక్టర్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4 నుంచి 8 నెలల వయసున్న ఆవు, గేదె జాతి ఆడ దూడలకు టీకా వేయడం ద్వారా జీవితకాలం బ్రొసెల్లోసిస్ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఇప్పటికే మండలంలోని పశు వైద్యశాలలలో 540 టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

భక్తులకు ఉచిత ఆటో సౌకర్యం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కార్తీక మాసంలో ప్రముఖ పుణ్యక్షేత్రం కుండలేశ్వరంలోని పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి ఎందరో భక్తులు ఎక్కువగా వస్తుంటారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని కాట్రేనికోనకు చెందిన పిఎస్ఎన్ రాజు (విలేకరి రాజు) ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వెళ్ళుటకు భక్తులకు ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు. కాట్రేనికోన నుంచి కుండలేశ్వరానికి సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి వెళ్లేందుకు ఆటోలు దొరకక చాలామంది భక్తులు ఇబ్బంది పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన పిఎస్ఎన్ రాజు తన ఆర్థిక సహాయంతో భక్తులకు సోమ ఆదివారాల్లో కాట్రేనికోన నుంచి ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నెప్రూకు గాయాలు

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు పట్టణం ఆంధ్రసుగర్ సమీపంలో గోదావరిగట్టుపైన లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఏలూరు ఎస్టేట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నెప్రూకు స్వల్ప గాయాలైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కొవ్వూరు పట్టణ సీఐ పీ విశ్వం ఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.